

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 15 సంచిక : 04 డిసెంబర్ 2009

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ............ 13-09-09

హైదరాబాద్ ........ 23-09-09

జిన్నూరు ............ 19-10-09

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-08-2009, మురమళ్ళ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎవరు ఎక్కడ యజ్ఞాలు చేసినా, తపస్సులు చేసినా దానిని నేను స్వీకరిస్తాను అని పరమాత్మ చెప్తున్నాడు. యజ్ఞాలద్వారా, తపస్సులద్వారా మనం పరమాత్మను పొందాలి. అగ్నిహోత్రంలో నెయ్యినిపోసి దేవతాప్రీత్యర్థం చేసేది ఒక్కటి మాత్రమే యజ్ఞం కాదు. మీరు స్వార్థం లేకుండా మనస్సులో కల్మషం లేకుండా ఓపెన్ మైండ్‌తో ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము. మనం చేసే సాధన ద్వారా దేహాభిమానం తగ్గించుకోవాలి. దేహాభిమానం తగ్గించుకోకపోతే మోక్షం రాదు అని పెద్దలు చెప్తున్నారు. ఇంతవరకూ ప్రపంచంలో ఏ స్వార్థపరుడికీ వాడు ఎంత సాధన చేసినా దేహాభిమానం తగ్గలేదు. ఏవో మేజిక్కులవలన, కుయుక్తులవలన ఎవరికీ మోక్షం రాదు. మనం ఇంకో మనిషిని మోసం చేయగలము కాని భగవంతుడిని మోసం చేయలేము ఎందుచేతనంటే మనలో ఆయన అంతర్యామిగా ఉన్నాడు. అందుచేత మనం చేతితో చెడ్డపని చేయకపోయినా, కంటితో చెడ్డ పని చేయకపోయినా, మన హృదయంలో ఏదైనా చెడుతలంపు వస్తే కూడా దానికి అంతర్యామిగా ఉన్న నారాయణుడికి సమాధానం చెప్పుకోవాలి. అది జ్ఞాపకం పెట్టుకోండి. సుందరకాండలో సీతమ్మ ఆంజనేయస్వామితో ఏమంది అంటే మహర్షి అంటే ప్రియము వచ్చినప్పుడు సంతోషం అనే వికారం ఎవరికైతేరాదో, అప్రియము వచ్చినప్పుడు భయం అనే వికారం ఎవరికైతే రాదో వాడు మహర్షి అని సీతమ్మ చెప్తుంది. అంటే సంతోషం, భయం ఈ రెండు

వికారాలు వచ్చినవాడు ఋషికాదు. ఓ హనుమా! నువ్వు రామభక్తుడివే. నీ శరీరం, ఇంద్రియాలు అన్నీ రాముడి సేవకు సమర్పించావు. నీ మనస్సంతా రామమయం. నువ్వు రామభక్తుడివి కాకపోతే ఇంక ఎవడయ్యా రామభక్తుడు అంటుంది సీత.

ఈ పని నేను చేస్తున్నాను, ఈ పని చేస్తే ఈ ఫలితం వచ్చింది, ఈ ఫలితాన్ని నేను అనుభవిస్తున్నాను అనుకునేవాడికి ఎవడికీ మోక్షం రాదు. అంటే కర్తృత్వం, భోక్తృత్వం ఉన్న వాడికి ఎవడికి మోక్షం రాదు. ఇదంతా ఎవరు అనుకొంటున్నారు? లోపల ఉన్న ఆత్మ అనుకోదు, అహంకారం అనుకొంటోంది. ఈ అనుకోవటాల వలననే మన స్వరూపానికి మనం దూరమవుతున్నాము. మనం పూజలు, జపాలు, ధ్యానాలు చేస్తున్నాము కాని కామక్రోధముల నుండి విడుదల పొందలేకపోతున్నాము. ఈ సంవత్సరం వ్యవసాయం చాలా కష్టపడి చేసాము కాని ఏమీ పండలేదు, పండకపోయినా ఫరవాలేదు కష్టపడ్డాను అంటే ఆ మాటలు ఎలా ఉంటాయో నేను జపాలు చేస్తున్నాను, ధ్యానాలు చేస్తున్నాను కామక్రోధముల నుండి బయటకు రాలేదు అని చెప్పేమాటలు అలాగే ఉంటాయి. వాడు కామక్రోధముల నుండి బయటకు రాకపోతే మరి జపధ్యానములు ఎందుకు చేస్తున్నట్లు? వాల్మీకి ఏమని చెప్పాడు అంటే నీ నెత్తిమీద ఏదైనా బరువు ఉంటే ఆ బరువును దింపేసాక అమ్మయ్య ఈ బరువును దింపేసాను అని నువ్వు ఎంత తేలికపడతావో అలాగే నీ అహంకారమనే బరువును ఈశ్వరుని పాదాల దగ్గరపెడితే, ఆయనకు అర్పించేస్తే అప్పుడువయ్యా నీకు జీవన్ముక్తస్థితి అని చెప్పాడు. అంటే అహంకారాన్ని ఖాళీ చెయ్యాలి. అహంకారం ఖాళీ అయ్యాక నీకు సంపద ఉన్నా, పాండిత్యం ఉన్నా అవి ఏమీ నిన్ను బాధపెట్టవు.

మనం నేను, నేను అంటున్నాము కదా. ఈ నేనే ప్రపంచాన్ని ఎంజాయ్‌చేస్తోంది, ఈ నేనే సంసారాన్ని ఎంజాయ్‌చేస్తోంది. ఇంటిదగ్గర ప్రశాంతంగా కూర్చున్నప్పడు మీరు అచ్యుత, అనంత, గోవింద, నారాయణ అని ఎలా అనుకొంటున్నారో అలాగే ఈ లోకాన్ని అంటిపెట్టుకొని, దేహాన్ని అంటిపెట్టుకొని ఊగిసలాడుతున్నా ఈ నేను ఎవరు అని ప్రశ్నకూడా వేసుకోవాలి. మీకు ఏదైనా లాభం వస్తే సంతోషిస్తున్నారు. దానికి శరీరం సంతోషించటంలేదు, మీ శరీరం లోపల ఉన్న నేను సంతోషిస్తోంది. అలాగే మీకు ఏదైనా నష్టం వస్తే ఏడుస్తున్నారు, దానికి మీ లోపల ఉన్న నేనే ఏడుస్తోంది. లాభం వచ్చినప్పడు లోపల ఉండి సంతోషించే ఈ నేను ఎవరు, నష్టం వచ్చినప్పడు లోపల ఉండి ఏడుస్తున్న ఈ నేను ఎవరు అని ఎప్పడైనా ఈ ప్రశ్న

నీకు ఉదయించిందా అని అడుగుతున్నారు. మీలో పండితులు ఉండవచ్చు, పామరులు ఉండవచ్చు, ధనవంతులు ఉండవచ్చు, పేదవారు ఉండవచ్చు ఇవన్నీ లోకం గొడవలు, బాహ్యమైన గొడవలు. వీటితో తాదాత్మ్యం పొందుతూ ఊగిసలాడుతున్న ఈ నేను ఎవరు అనే ప్రశ్న నీకు ఎప్పుడైనా ఉదయించిందా?

విద్య లేకపోయినా ఈ సమాజంలో సంస్కారవంతుడు ఎక్కువ గౌరవింపబడతాడు. ఎంత విద్య ఉన్నా, ఎంత ధనం ఉన్నా ఆ మనిషికి సంస్కారం లేకపోతే ఈ లోకం వాడిని గౌరవించదు. అందుచేత మీరు చదువుకొన్న విద్య కంటే సంస్కారం గొప్పది. ఆ సంస్కారం రావటానికి జన్మజన్మల నుండి సాధన చెయ్యాలి. మీరు చాలా సుఖాలు అనుభవిస్తున్నారు. ఇంద్రియాలు ఇచ్చే సుఖాలు అనుభవిస్తున్నారు, లోకానికి సంబంధించిన ఊరేగింపులు అన్నీ అయిపోయినాయి. మీకు కావలసిన తిండి తింటున్నారు, కోరికలు నెరవేర్చుకొంటున్నారు, అన్ని సుఖాలు అనుభవిస్తున్నారు రైటే. మీ లోపల ఒక సద్వస్తువు ఉంది, బ్రహ్మం ఉంది. అది ఇచ్చే శాంతిని, అది ఇచ్చే ఆనందాన్ని ఎప్పుడైనా రవ్వంత అనుభవించారా? మీకు ఇన్ని ఏళ్ళు వచ్చాయి ఆ బ్రహ్మం ఇచ్చే ఆనందాన్ని ఎప్పుడైనా కనీసం ఒక్క క్షణం అయినా అనుభవించారా అని అడుగుతున్నారు. మీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఆ సంఘటనలు ఇలా జరుగుతున్నాయి ఏమిటి అని ఏడుస్తూ కూర్చోవద్దు, అందులో నుండి పాఠాలు నేర్చుకోండి. మీ ప్రారబ్ధాన్ని బట్టి ఆ సంఘటనలు జరుగుతూ ఉంటాయి. మీరు ఆ ప్రారబ్ధాన్ని అనుభవించకుండా చేయటానికి ఎవరైనా ప్రయత్నం చేసినా అది ఆగదు, ఆ ప్రారబ్ధం మీకు అనుభవంలోనికి వచ్చి కాని అది బయటకు వెళ్ళదు. దీనికి పరమాత్మ ఏమి చెప్పాడు అంటే ఆ ప్రారబ్ధాన్ని నువ్వు ఎలాగూ అనుభవించాలి అందుచేత నువ్వు చేసేపని ఇష్టంతో చెయ్యి, అయిష్టంతో చెయ్యవద్దు అని పరమాత్మ చెప్పాడు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే పాయసం నోట్లో పోసుకొన్నప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో, ఒకవేళ నీకు చెడు ప్రారబ్ధం ఎదురైనా దానిని అలా ఎంజాయ్ చెయ్యగలిగితే రాబోయే జన్మలలో అటువంటి ప్రారబ్ధం రాదు అని చెప్పారు. మంచి ప్రారబ్ధం వస్తే ఎగిరిపడకు, చెడు ప్రారబ్ధం వస్తే కుంగిపోవద్దు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే గుర్రానికి వెళ్ళేటప్పుడు గంతలు కడతారు, అది అటు ఇటు చూడదు, నిదానంగా వెళ్ళిపోతూ ఉంటుంది. మీకు ఇష్టమైన భగవంతుడిని నామాన్ని తీసుకొని ఆ నామాన్ని చేసుకొంటూ ఉంటే, ఆ నామం మీద మీకు ప్రీతి ఉంటే గుర్రం రోడ్డుమీద దిక్కులు

చూడకుండా నిదానంగా ఎలాగ వెళ్ళిపోతుందో అలాగ మీరు కూడా నిదానంగా వెళ్ళిపోయి భగవంతుడిలో ఐక్యం కావచ్చు. మీరు మంచి ప్రారబ్దం అనుభవిస్తున్నా ఒకవేళ మీకు చెడు ప్రారబ్దం ఎదురైనా దానిని అనుభవిస్తున్నాము అనే తలంపు లేకుండా, బాధలేకుండా భగవంతుడిలో ఐక్యం కావచ్చు అని రామకృష్ణుడు చెప్పాడు. భగవంతుడి మీద ప్రీతి ఎప్పుడైతే తగ్గిపోయిందో, ఆయన మీద విశ్వాసం ఎప్పుడైతే తగ్గిపోయిందో ఇంక మనం ఇంద్రియాలను, మనస్సును జయించలేము. ఆయన మీద విశ్వాసం ఉంటే, భక్తి ఉంటే ఇంద్రియనిగ్రహానికి మనోనిగ్రహానికి మనకు సహకారం చేస్తాడు.

మనకు లోపల అరిషడ్వర్గాలనే శత్రువులు ఉన్నారు, ఆ శత్రువులను జయిస్తేనేగాని లోపల ఉన్న బంగారం నీకు దొరకదు. నువ్వు కోటలో ప్రవేశించాలంటే అక్కడ ఉన్న సైనికులనందరినీ చంపగలిగితేనే నువ్వు కోటలో ప్రవేశించగలవు. అలాగే నువ్వు హృదయంలో ప్రవేశించేటప్పుడు లోపల ఉన్న శత్రువులందరూ నీకు అడ్డు వస్తారు, వాటిని నిశ్శేషంగా నశింపచేసినప్పుడే నువ్వు హృదయంలో ప్రవేశించగలవు, అక్కడ ఉన్న సద్వస్తువును పొందగలవు, అక్కడ ఉన్న శత్రువులను జయించకుండా నువ్వు లోపలకు వెళ్ళలేవు. మీకు బాగా ఆస్తులు ఉన్నాయి అనుకోండి, మేము చాలా ఆస్తిపరులం అనుకొంటారు. మీరు చాలా ఆస్తిపరులు అని ఇతరులు ఎవరైనా అంటే మీరు పైకి మర్యాదగా కనబడినా లోపల సంతోషిస్తారు. మీ లోపల ఉండి సంతోషించేవాడే పిశాచం, వాడే సైతాను. నువ్వు దేహంలో నుండి బయట పడటంకాదు, వాడిలో నుండి బయటపడాలి. నీకు పునర్జన్మలను తీసుకొని వచ్చేది వాడే, వాడే అహంకారం, వాడు వేరుతో సహా నశించే వరకూ నీకు మోక్షం లేదు. నీ క్షేమం కోరేవాడిని, నీకు నిజమైన మిత్రుడిని నేనే, నీ ఒక్కడికే కాదు, ఈ జీవకోటికంతకూ నేనే మిత్రుడను అని పరమాత్మ చెపుతున్నాడు. మీకు దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన ఎక్కువగా ఉన్నాయి. ఈ దేహ వాసనవలన, శాస్త్రవాసనవలన, లోకవాసనవలన నేను మీ క్షేమం కోరుతున్నానని, మోక్షం వైపుకు మిమ్మల్ని నడిపిస్తున్నానని, అసలు నేను ఉన్నానని మీకు గుర్తింపు లేకుండా పోతోంది అంటున్నాడు పరమాత్మ.

మీ దేహానికి సంబంధించిన బంధువులు అందరూ వ్యవహారిక సత్యాలే, ఆ వ్యవహారం అలా నడుపుకోండి. కాని మీ నిజమైన బంధువు ఎవడు అంటే పరమేశ్వరుడే మీకు నిజమైన బంధువు. మీ ఆయన మిమ్మల్ని నా భార్య అనుకోవచ్చు, మీరు ఆయనను నా భర్త అనుకోవచ్చు,

కళ్ళు మూస్తే భార్య ఏమిటి, భర్త ఏమిటి? ఈ మధ్య ఒక పెద్ద మనిషి ఏమిచెప్పాడు అంటే మొదటి భార్య చనిపోతే రెండో పెళ్ళి ఎప్పుడు చేసుకొందామా అని ఉరకలు వేస్తూ ఉంటారు. నువ్వు ఎవడివాడవు. ఇప్పుడు మొదటిపెళ్ళానికి నీకు సంబంధం ఏమయింది? మీ ఇద్దరికి అసలు సంబంధం ఏమిటి? మొదటి పెళ్ళాన్ని మరిచిపోయి రెండోపెళ్ళి కోసం ఎలా శ్రమపడి తిరుగుతున్నాడో అలాగ ఆత్మజ్ఞానం కోసం శ్రమపడవయ్యా అంటున్నారు. ఈ ఉదాహరణ మీకు నచ్చకపోవచ్చు, బండతనంగా ఉంది. ఇది బండతనంగా ఉన్నా మరి బండమనుషలకు అలా చెప్పాలి కదా. సర్వసాధారణంగా ఒకరిని ఒకరు ఎందుకు ప్రేమించుకొంటారు అంటే ప్రతిఫలం కోరే ప్రేమించుకొంటారు, పైకి చెప్పరుకాని అది లోపల అట్టడుగున ఉంటుంది. మీ దగ్గర నుండి ఏమీ ఆశించకుండా, ప్రతిఫలంకోరకుండా మిమ్మల్ని ప్రేమించేవాడిని నేనే, మీ నిజమైన స్నేహితుడిని నేనే అన్న సంగతి కూడా నీకు గుర్తింపుకు రావటంలేదు అంటున్నాడు పరమాత్మ. మీ కుటుంబ సభ్యులు మటుకే నీ క్షేమం కోరుతున్నారు అని నీవు అనుకొంటున్నావు కాని నీ కుటుంబసభ్యులకంటే భగవంతుడే ఎక్కువ నీ క్షేమం కోరుతున్నాడు అన్న సంగతి నీకు తెలియటం లేదు కాబట్టి ఈ మాట చెపుతున్నాడు. జీవుడు రోజుకోరకంగా ఉంటాడు, మనస్సుతో వచ్చే ప్రేమలను నమ్మటానికి వీలులేదు. మీ యోగక్షేమాలను చూసేవాడిని నేనే, మీకు కావలసింది ఇచ్చి మిమ్మల్ని కాపాడేవాడిని నేనే అని పరమాత్మ చెపుతున్నాడు కాని మనకు ఆ గుర్తింపు లేదు.

జీవుడు ఎవడూ స్వతంత్రుడు కాదు. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉండి మన ప్రారబ్దంననుసరించి ఈ బొమ్మలను ఆడిస్తున్నాడు. ఆయన సర్వనియంత, ఏ గంటలో ఏ ప్రారబ్దం మనం అనుభవించాలో అది వచ్చేస్తుంది. మన మీద ఇష్టంలేక ఆ ప్రారబ్దం తీసుకొని రాడు. అక్కడ నుండి మనం కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. ఎవరో చెప్పినదానికంటే జీవితానుభవంలో నేర్చుకొన్నవి పెర్మనెంట్‌గా ఉంటాయి. భగవంతుడిని ఎవడైతే హృదయంలో అనుభవిస్తున్నాడో వాడి దగ్గరకు వెళ్ళి భగవంతుడు లేడు అంటే వాడు నవ్వి ఊరుకుంటాడు, మనతోటి వాదించడు. నేను మిమ్మల్ని ఎలాగ ప్రత్యక్షంగా చూస్తున్నానో, మీరు నన్ను ఎలాగ ప్రత్యక్షంగా చూస్తున్నారో అలాగ వారు దేవుడిని హృదయంలో దర్శిస్తూ ఉంటారు, వారు భగవదనుభవం పొంది ఉంటారు. మీరు మనస్సుతో మంచిఆలోచనలు చేస్తూ ఉంటే, నోటితో మంచిమాటలు మాట్లాడుతూ ఉంటే, చేతులతో మంచిపనులు చేస్తూ ఉంటే దాని వలన

మీ మనస్సు సంస్కరింపబడుతుంది. మీరు ఎవరికైనా ఏదైనా సహాయం చేస్తే వాడు కోటీశ్వరుడు అయిపోడు కాని దానివలన మీ మనస్సు సంస్కరింపబడుతుంది. భగవంతుడు ఏమనిచెపుతున్నాడు అంటే కర్మఫలాన్ని ఆశించకుండా నువ్వు ఇది మంచిపని అనుకొంటే చేసెయ్యి. నీ మనస్సును ఫలితంమీద పెట్టవద్దు, అప్పడు ఇంక నీ మనస్సుకు శ్రమ ఉండదు, నీ మనస్సు నెమ్మదిగా పల్చబడి అది నశిస్తుంది, నువ్వు ఇంట్లో పని చేసినా, సమాజంలో పనిచేసినా అందరి హృదయాలలో నారాయణుడు ఉన్నాడని దృష్టిలో పెట్టుకొని పని చెయ్యి. నువ్వు ఎవరికైనా ఏదైనా మంచిచేసినా, నీకు ఎవరిమీద అయినా ద్వేషం వస్తూ ఉన్నా వారి హృదయంలో కూడా నారాయణుడు ఉన్నాడని మరిచిపోవద్దు, అప్పడు మనస్సులో ఉన్న హెచ్చుతగ్గులు పోతాయి. నేలమీద మెరకపల్లాలు ఉండవచ్చుకాని నీ మనస్సులో మటుకు మెరకపల్లాలు ఉండనివ్వకు, మనస్సును సమానంగా ఉంచుకో. మీరు ఇంట్లో అనుభవిస్తున్న కష్టసుఖాలకు, జయానికి అపజయానికి మీ పూర్వజన్మలకి సంబంధం ఉంటుంది. మీరు పూర్వజన్మలో చేసిన కర్మలను బట్టి అవి వస్తూ ఉంటాయి. మీరు అనుభవించవలసింది ఏదైనా ఉంటే వందజన్మల తరువాత అయినా మీ శరీరం ద్వారా దానిని అనుభవింపచేస్తాడు, అలా అనుభవిస్తే బాకీ తీరిపోతుంది, అయితే ఈలోపుగా మీరు సాధన చేసి, ఈశ్వరానుగ్రహం వలన మీకు ఆత్మజ్ఞానం కలిగితే మొత్తం మీ సంచిత కర్మలన్నీ జ్ఞానాగ్నిలో కాలిపోతాయి.

ఎవరైతే ఉపకారం చేస్తారు అనుకొంటామో ఒకోసారి వారు మనకు ఉపకారం చెయ్యరు, వారు మనకు ఉపకారం చెయ్యరు అనుకొన్నప్పడు ఒకోసారి వారే మనకు ఉపకారం చేస్తారు, ఎవరు మనకు ఉపకారం చేస్తారో, ఎవరు ఉపకారం చెయ్యరో మనకు తెలియదు. అందుచేత ఎవరిమీద ద్వేషం పెట్టుకోవద్దు. ద్వేషం మనకు శత్రువుతో సమానం. ద్వేషం వలన, అసూయ వలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది కాని మనస్సుకు అంతర్దృష్టి రాదు. అంతర్దృష్టి లేకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. మీకు ప్రారబ్దంలో గౌరవం వచ్చే యోగం ఉంది అనుకోండి మీరు ఏమీ పని చెయ్యకపోయినా మీకు గౌరవం వచ్చేస్తుంది, దానిని మేము లాగేయాలన్నా సాధ్యంకాదు. కొంతమంది మగవారు చాలా కష్టపడతారు, ఆడవారికి గౌరవాలు వచ్చేస్తాయి, అవి మనం ఆపలేము. అంటే మీ ప్రారబ్దంలో ఏదైతే ఉందో అది జరిగిపోతూ ఉంటుంది, మీ కోరికతో సంబంధం లేదు. నాకు ఇంట్లో వారిమీద మమకారం పోవటంలేదేమిటి అని ఒకరు భగవాన్‌ను అడిగారు, ఆ మమకారం కూడా నీ ప్రారబ్దంలో ఒక భాగం అన్నారు భగవాన్.

ఇంట్లోవారు పొమ్మన్నా వారికోసం నువ్వు పనిచేయటం నీ ప్రారబ్దంలో ఒక భాగం అని చెప్పారు. భార్యభర్తలు కూడా కొంతకాలం స్నేహితులుగా ఉంటారు, మరల ఏవో విరోధాలు వచ్చేస్తాయి, ఈ గొడవలు అన్నీ దేహప్రారబ్దాన్ని బట్టి అలా వస్తూ ఉంటాయి, ఇవి అన్నీ అసత్యాలు, ఇవన్నీ స్వప్న సమానము. నీ దేహప్రారబ్దంలో పని చేయవలసిన యోగం ఉంటే నువ్వు తప్పించు కోలేవు. పని చేసే యోగం లేకపోతే నువ్వు బలవంతాన పనికోసం తిరిగినా పని దొరకదు. దేహప్రారబ్దంలో పని చేసే యోగం లేకపోతే వాడికి ఎవరు పని చెప్పరు, నువ్వు చెయ్యవద్దురా అబ్బాయి, అలా కూర్చో మేము చక్కబెడతాము అంటారు. జ్ఞాని పని చేసినా చెయ్యనివాడితో సమానము ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వం లేదు, దేహబుద్ధిలేదు. దేహబుద్ధి లేనివాడు పని చేసినా చెయ్యనివాడితో సమానము ఎందుచేతనంటే ఆ పని వలన వచ్చే పుణ్యపాపములు వాడికి అంటవు.

మాకు తలంపులు ఎక్కువ వచ్చేస్తున్నాయి, నిద్ర పట్టటం లేదు అని చాలామంది అంటారు నిద్రబాగా పట్టటానికి మీకు కొన్ని ఉపాయాలు చెపుతున్నాను. నిద్రపోయేముందు మీకు ఇష్టమైన దేవుడిని స్మరించుకోండి, ముక్కులోనికి వెళ్ళేగాలిని, బయటకు వచ్చే గాలిని అలా చూసుకోండి, మీ అభిమాన గ్రంథంలో ఒక పేజి చదవండి, మీకు బాగా ఇష్టమైనవారిని తలపెట్టుకోండి ఇలా చేస్తూ ఉంటే మీకు వెంటనే నిద్ర వచ్చేస్తుంది, ఒక ప్రక్క మీరు ఇంట్లో పనులు చక్కబెట్టుకోండి, రెండోప్రక్క ఆత్మజ్ఞానం సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయండి. భగవంతుడిని తెలుసుకోవాలి అనే కాంక్షని వదిలేసి 24 గంటలు ఇంట్లో గొడవలతో కూర్చోవద్దు అని బాబాగారు చెప్పారు. ఇంట్లో పనులు చక్కబెట్టుకొని మిగతాటైము అంతా నన్ను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయండి అని పరమాత్మ గీతలో చెప్పాడు. చలంగారు ఏమని చెప్పారు అంటే ఒకవేళ మీకు కాలక్షేపం అవ్వకపోతే లౌకికులతో స్నేహాలు చేయటంకంటే, భక్తులుకాని వారితో స్నేహం చేయటంకంటే వెయ్యి రూపాయలు పెట్టి ఒక గొర్రెను కొనుక్కొని దాని వెంట్రుకలు లెక్కపెడుతూ కాలక్షేపం చేసుకోండి అని చెప్పారు. మీ బాధలను లోకానికి పంచిపెడితే మీరు బుద్ధిమంతులు కాదు, లోకం యొక్క బాధను మీరు పంచుకొంటే మీరు బుద్ధిమంతులు. మీరు భగవంతుడి రూపాన్ని ధ్యానించుకొంటూ ఉంటే, భగవంతుడి గుణాలను స్మరించుకొంటూ ఉంటే మీ మనస్సు ఇంద్రియాలను ముట్టుకోవటం మానేస్తుంది. మనస్సు వెళ్ళి ఏ ఇంద్రియాన్ని ముట్టుకొంటే ఆ ఇంద్రియానికి ప్రకోపం వస్తుంది కాని మనస్సు

ఇంద్రియాలను ముట్టుకోదు అనుకోండి మీకు తెలియకుండానే ఇంద్రియనిగ్రహం వచ్చేస్తుంది.

నువ్వు బాగుపడటానికి ప్రయత్నం చెయ్యి. నారాయణుడు నీలోపలే ఉన్నాడు కదా, ఆయన నీ ప్రయత్నాన్ని చూస్తున్నాడు కదా అప్పుడు ఆయన దయ నీకు కలుగుతుంది, నీ పని పూర్తి అయిపోతుంది, నీకు మోక్షం కలుగుతుంది. నీ మనస్సును ఉదాత్తమైనస్థితికి తీసుకొని పోవటానికి నువ్వు ప్రయత్నం చేసుకోకపోతే ఎవరు వచ్చి నీ కోసం ప్రయత్నం చేస్తారు. అందుచేత నిన్ను నీవు బాగుచేసుకో. నువ్వు మనస్సును బాగుచేసుకొంటే, మనస్సును సంస్కరించుకొంటే నువ్వు మోక్షానికి వెళతావు, మనస్సును బాగుచేసుకోకుండా గాలికి వదిలేస్తే పతనమవుతావు, రెండూ నీ చేతిలో ఉన్నాయి, నువ్వు బాగా ఆలోచించుకో, నువ్వు పాజిటివ్‌గా ఉండు. నెగిటివ్‌గా ఆలోచించవద్దు, నెగిటివ్‌గా ఆలోచిస్తే భయం పెరిగిపోతుంది. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. ఎవరైనా మీ మీద పిడకలు విసిరితే తిరిగి ఆ పిడకలను వారి మీద విసిరేయకుండా ఆ పిడకలను పోగుచేసుకొని ఇంటికి పట్టుకొనివెళ్ళి అన్నం వండుకోవటానికి ఉపయోగించుకో అని చెప్పారు, అది పాజిటివ్ తింకింగ్. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే కంగారు పడిపోతారు, అలా కంగారుపడకుండా మీరు సహనంగా ఉంటే మీలో ఉన్నదోషాలు వారికి పోతాయి. కుయుక్తులతోటి, కుతంత్రాలతోటి, కుచేష్టలతోటి నీ మనస్సును పాడుచేసుకోవద్దు. మాకు బంధువులు ఉన్నారు, బంధువులు ఉన్నారు అనుకోకు. నీ బంధువులు కాదు నిన్ను ఉద్ధరించేది, నీ మనస్సును బంధువుగా చేసుకుంటే అది నీకు సహాయం చేసినట్లు ఏ బంధువు నీకు సహాయం చేయలేడు. నీ మనస్సుకు మించిన బంధువు నీకు లేడు. నీ దేహం చనిపోయిన తరువాత నీ బంధువులు ఎవరూ నీ కూడా రారు కాని నీ మనస్సు నీ కూడా వచ్చేస్తుంది. నీ శరీరం చనిపోయిన తరువాత ఏది నీ కూడా వస్తుందో దానిని బాగుచేసుకోవటానికి కొంచెం కూడా ప్రయత్నం చేయుటం లేదు. మన మనస్సును బాగు చేసుకోవటానికి సత్పురుషులతోటి, మహాత్ములతోటి సాంగత్యం అవసరం. మన లోపల బలహీనతలు ఉన్నప్పుడు, మురికి గుంటలు ఉన్నప్పుడు మనతోటి మనం శాంతిగా ఉండలేము, లోకంతోటి కూడా శాంతిగా ఉండలేము. రామకృష్ణుడు అంటాడు ఈ నేను అనే తలంపును మా లోపల నువ్వే పెట్టావు. నీ దయ లేకుండా అందులోనుండి మేము బయటకు రాలేము. ఈ నేను అనే తలంపులోనుండి బయటకు రాకుండా మాతో నువ్వు ఆడుకొంటున్నావు. ఇది నీకు ఆట, మాకు ప్రాణసంకటం. ఈ మనస్సు అనే చిన్న అవకరం తీసేస్తే, ఈ నేనును తీసేస్తే

మీకు ఈ శరీరం ఉండగా సుఖం. శరీరం పోయాక కూడా సుఖమే. ఆ మనస్సే మనలను పీడిస్తోంది, దానిని తీసెయ్యి.

శ్రద్ధ వలన జ్ఞానం కలుగుతుంది. శ్రద్ధ అనే పెట్టుబడి కనుక నీకు ఉంటే పరమశాంతికి, అలౌకిక శాంతికి నువ్వు వారసుడవు అవుతావు. ఆకలిగా ఉన్నవాడికి అన్నం కావాలి, చీకటిలో ఉన్నవాడికి వెలుతురు కావాలి. ఇప్పుడు మనకు కావలసింది అన్నంకాదు, వెలుతురు కావాలి. చీకటిలో నుండి వెలుతురులోనికి వెళ్ళాలి. చీకటిలోనుండి జ్ఞానం అనే వెలుగులోనికి మమ్మల్ని మళ్ళించు, అది నీ దయ లేకుండా సాధ్యం కాదు అని అంటున్నాడు. మీకు ఏదైనా అవసరం ఉంటే ఇతరుల ఇంటికి వెళ్ళండి, కాలక్షేపం కోసం వెళ్ళవద్దు. కాలక్షేపం కోసం వెళ్ళి కూర్చుంటే లేనిపోని గొడవలు వస్తాయి, ప్రతీ ఇంట్లోను ఏవో లోటుపాట్లు ఉంటాయి. వారు ఏదో కష్టసుఖాలు చెప్పకొంటే మీరు ఊరుకొంటారా వాటిని బజారులో పెడతారు, చివరకు వారింట్లో పిల్లలకు పెళ్ళిళ్ళు కూడా అవ్వకుండా చేస్తారు, మనం అంత బుద్ధిమంతులం. మన ఇంట్లో లోటుపాట్లు ఎలాగ ఉన్నాయో అలాగే మనస్సులో కూడా లోటుపాట్లు ఉంటాయి, అవి మిమ్మల్ని పూర్ణస్థితికి రానివ్వవు. నీలోపల ఉన్న లోటుపాట్లను సవరించుకోకుండా నువ్వు మోక్షాన్ని పొందలేవు. డబ్బు ఉంటే భోగాన్ని కొనుక్కోవచ్చుగాని యోగాల్ని, జ్ఞానాన్ని కొనుక్కోలేము. సజ్జనసాంగత్యం వలన యోగం వస్తుంది. మీ మనస్సును బాగుచేసుకోండి. మీ మనస్సును బాగుచేసుకొంటే మీరు ఏ స్థాయికి వెళ్ళిపోతారు అంటే దేవుడిని మీరు కళ్ళతో చూడటం కాదు, దేవుడితో సమానమైన స్థాయి మీకు వచ్చేస్తుంది. రాముడి పని చేసి ఆంజనేయస్వామి కూడా రాముడి స్థానాన్ని పొందాడు. వాడిని స్మరిస్తే నన్ను స్మరించినట్లే, వాడికి నమస్కారం పెడితే నాకు నమస్కారం పెట్టినట్లే అంటాడు రాముడు, అంటే రాముడి పనిచేసి ఆంజనేయ స్వామి రాముడితో సమానం అయిపోయాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-09-2009, కాశీ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కాశీ అంటే ప్రకాశం. కాశీలో ఉన్న గంగానది మనల్ని పవిత్రం చేస్తుంది. అరుణాచలంలో ఉన్న కొండ మనల్ని పవిత్రం చేస్తుంది. తీర్థయాత్రలు, మహాత్ముల దర్శనం ఇవన్నీ ఎందుకు చేస్తున్నాము అంటే మన బుద్ధిని శుద్ధి చేసుకోవటానికే ఇవి అన్నీ. మనకి సంతోషం రావటానికీ, దుఃఖం రావటానికీ బయట కారణాలతోటి సంబంధం లేదు. మన మనస్సు రాంగ్‌గా ఉంటే

బయట పరిస్థితులు మనకి బాగున్నా అశాంతిగా ఉంటాము. మన మనస్సు రైట్‌గా ఉంటే బయట పరిస్థితులు మనకు ప్రతికూలంగా ఉన్నా శాంతిగా ఉంటాము. కానీ బయట గొడవలకీ దీనికీ సంబంధం ఉందేమో అని మనకు అనిపిస్తూ ఉంటుంది. మన శరీరం ఈ రోజు కాశీలో ఉంది. మన తెలివితేటలను బట్టి మనం ఇక్కడకు రాలేదు. దేహం యొక్క ప్రారబ్దాన్ని అనుసరించి ఈ దేహాన్ని ఈశ్వరుడు ఇక్కడకు తీసుకువచ్చాడు. మన శరీరం ద్వారా మనస్సు ఏ అనుభవాలు పొందాలి, ఏమి పాఠాలు నేర్చుకోవాలి, వాడు పొందవలసిన అనుభవాలు అయిపోయిన తరువాత, వాడు తినవలసిన మొట్టికాయలు కూడా పూర్తి అయిపోయిన తరువాత ఆ దేహం చనిపోతుంది. మనం జీవితం తోటి రాజీపడటం మంచిది. మనం జీవితంతోటి రాజీపడకపోతే రోజూ అశాంతే. మనం రాజీపడటం నేర్చుకోవాలి. మనందరం ఆత్మహంతకులం అన్నారు భగవాన్. నీ హృదయంలో ఆత్మ ఉంది. దాని తాలుక ఎరుక నీకు లేదు కాబట్టి, దాని తాలుక గుర్తింపు లేకుండా ఉన్నాము కాబట్టి మనందరం ఆత్మహంతకులం అన్నారు భగవాన్. మనం స్వార్థంతోటి చేసే ప్రతీ పని, ప్రతీ మాట దేహాభిమానాన్ని పెంచేస్తుంది. మనం స్వార్థం లేకుండా ఏ పని చేసినా అది మనల్ని బంధించదు, దానివలన మనకు పాపం కూడా రాదు. వ్యక్తిభావన లేకుండా పని చేస్తే మంచిచెడ్డలు, పుణ్యపాపాలు ఏమీ నిన్ను అంటవు. దేహమే నేను అనే తలంపు ఉన్నంతకాలం నువ్వు వ్యక్తిభావన లేకుండా ఉండలేవు. మనోనాశనం అయ్యేవరకూ మంచికి మంచి, చెడ్డకి చెడ్డ వచ్చేస్తుంది. వాటిని నీవు అనుభవించాలి. ఏ స్థానాన్ని పొందిన తరువాత పుట్టుకలు, చావులతోటి నీకున్న సంబంధం తెగిపోతుందో ఆ స్థానం నీ హృదయంలోనే ఉంది. అందులో పుడితేనే అది నీ నిజమైన పుట్టినరోజు, ఆ స్థానాన్ని పొందేవరకూ నీకు పునర్జన్మలు తప్పవు, అప్పటి వరకు నీవు శవాలను మోస్తూ ఉండవలసిందే.

కారుకి డ్రైవరు ఎటువంటివాడో మన శరీరానికి బుద్ధి అటువంటిది. డ్రైవరు సరిగ్గా లేకపోతే కారు పల్టీకొట్టేస్తుంది. అలాగే మన బుద్ధి సరిగ్గా లేకపోతే శరీరం పతనం అయిపోతుంది. మనం దేవాలయానికి వెళ్ళినప్పుడు స్వామీ నాకు మంచి బుద్ధిని ప్రసాదించు అని కోరుకోవాలి కాని మనం ఏమి చేస్తాము అంటే ఇంట్లో తాత్కాలికంగా ఏవో కష్టాలు ఉంటాయి కదా ఆ కష్టాలు పోవాలని కోరుకొంటాము. మనకి మంచి బుద్ధి లేకుండా భగవంతుడిని తెలుసుకోలేము. బుద్ధి నిండా వంకరలు పెట్టుకొని మీరు సాధనలు చేస్తే చెయ్యవచ్చునుకాని

సాధన ఫలించదు. హృదయంలో ఉన్న వస్తువు మనకి ఎందుకు తెలియటంలేదు అంటే పైన మేఘాలు ఉన్నప్పుడు సూర్యుడు మనకి కనబడడు. మేఘాలులాంటివే తలంపులు. మనకి పగలు అస్తమానూ ఒక తలంపు వస్తుంది అది వెళ్ళిపోతుంది. మళ్ళీ ఒక తలంపు వస్తుంది అది వెళ్ళిపోతుంది. ఆ రెండు తలంపుల మధ్య పెద్ద గేప్ ఉండదు. తలంపులు మన హృదయంలో ఉన్న వస్తువుని కనపడనివ్వకుండా చేసేస్తున్నాయి. పక్షులు గూడులు కట్టుకుంటాయి. మన జన్మాంతరంలో నుండి వచ్చిన వాసనలన్నీ కూడా మన హృదయంలో గూడు కట్టుకున్నాయి. ప్రతీ వాసన మూలంతోటి నశించేవరకూ ఎవరూ పునర్జన్మలు ఆపుచేయలేరు. అందరూ శరీరం గురించి ఆలోచించుకుంటారు, ఇల్లు గురించి ఆలోచించుకుంటారు కాని మరణానంతరం మన కూడా వచ్చే మనస్సుని బాగుచేసుకోవాలనే బుద్ధి ఎవరికీ కలగటంలేదు. మీ మనస్సుని ఎవరో వచ్చి బాగుచేసిపెడతారని ఎప్పుడూ అనుకోకండి. మీరు హృదయపూర్వకంగా, సిన్సియర్‌గా మేగ్జిమమ్ ఎఫర్ట్‌చేసి మీ మనస్సును బాగుచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. కొంతమంది ఏది చెప్పినా నెగిటివ్‌గా తీసుకుంటారు. ఎవరైతే జీవితంలో జరిగే ప్రతీ సంఘటన పాజిటివ్‌గా తీసుకుంటారో వారు బాగుపడతారు.

మీకు ఎవరిమీద ఎక్కువ మమకారం ఉందో వారిచేత మిమ్మల్ని తిట్టిస్తాడు భగవంతుడు. మీ మనస్సుని మోక్షం పొందటానికి భగవంతుడు సిద్ధం చేస్తున్నాడు. మనతోటి స్నేహంగా ఉన్నారు వీళ్ళు ఏమిటి ఇలా తిట్టేస్తున్నారు అని మీరు అనుకుంటారు. అది ఈశ్వరుడు చేసే పని అని తెలియక వారి మీద కోపాలు పెట్టేసుకుంటారు. మీ మనస్సు భగవంతుడి వైపుకు తిరగకుండా ఎక్కడైతే మమకారం ఉందో అక్కడ ఆగిపోతుంది. సాధన చేసినా మీ సాధన అంతా అక్కడ ఆగిపోతుంది. మీ సాధనకు ఏదైతే అడ్డుగా ఉందో నెమ్మదిగా దానిని ఊడగొడతాడు. అప్పుడు మీ మనస్సులో వంకర తగ్గిపోయి మళ్ళీ దేవుడు వంక చూస్తూ ఉంటుంది. ఇవన్నీ దేవుడే చేస్తాడు. లింగం అంటే గుర్తు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఈ ప్రపంచానికీ, మనకీ ఒక ప్రభువు ఉన్నాడు. మన కంట్రోలరు ఒకడు ఉన్నాడు అని చెప్పటానికి గుడిలో లింగం పెట్టారు. దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి నీ మనస్సుతో ఈశ్వరుడి పాదాలు విడిచిపెట్టకుండా ఉంటే ఆ ప్రారబ్దం కొట్టేదెబ్బలు మీకు తగలవు. ఎందుచేతనంటే మీ మనస్సుకు దేహంతోటి తాదాత్మ్యం లేదు, ఈశ్వరుడితోటి తాదాత్మ్యం ఉంది. అందుచేత ఎన్ని సంఘటనలు జరిగినా ఏమీ జరగనట్టే ఉంటుంది. మీకు వెయ్యికోట్లు ఉన్నాయి అనుకోండి

మీ మైండు రాంగ్ మైండు అయితే మీకు దుఃఖం వచ్చి తీరుతుంది. మీకు దుఃఖం రాకుండా ఎవరూ ఆపుచేయలేరు. మీది రైట్‌మైండు అనుకోండి మీరు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా మీకు అశాంతి రాదు. ఎందుచేతనంటే మీ రైట్‌మైండ్ మీకు రక్షణని ఇస్తుంది. రైట్‌మైండు ఉన్నవాడు పొంగిపోడు, కుంగిపోడు. నంది ఏ విధంగా అయితే ఈశ్వరుడిని చూస్తు ఉంటుందో ఆలాగే రైట్‌మైండ్ ఉన్నవాడు ఈశ్వరుడి డైరెక్షన్‌లో ఉంటాడు. మీరు గుడిలోకి వెడితే నందీశ్వరుడు మీ వంక చూడడు, నందీశ్వరుడు చూపు ఈశ్వరుడి మీదే ఉంటుంది. మన మనస్సు కూడా అలా ఉంటే తరిస్తాము. అప్పడు శరీరం మీద ఏ సంఘటనలు జరిగినా దాని ప్రభావం మన మీద ఉండదు. దుఃఖం దేహం అనుభవించదు, దేహం నేను అని ఏ తలంపు అనుకుంటోందో ఆ తలంపు అనుభవిస్తోంది. ఆ తలంపును ఈశ్వరుని పాదాల దగ్గర ఉంచితే మీరు ఈశ్వరుడికి శరణాగతి చేస్తే ఇంక అనుభవించే వాళ్ళు ఎవరు ఉంటారు? మీకు జ్ఞానం కలిగిన తరువాత ప్రపంచంలో ఉన్న దుఃఖం అంతా మీకు ఒక్కరికి వచ్చేసినా మీకు ఏమీ అనిపించదు. అది జ్ఞాని యొక్క స్థాయి. జ్ఞాని శాంతిని తప్పించి, ఆనందాన్ని తప్పించి, సుఖాన్ని తప్పించి మీకు ముక్తి స్థితిని తప్పించి ఇంకోటి ఇవ్వటానికి అసలు ఆయన దగ్గర ఏమి లేదు. మీరు జ్ఞాని మీద పుష్పాలు వేసినా లేకపోతే రాళ్ళు పెట్టి కొట్టినా ఆయన స్థానంలోంచి పతనం అవ్వడు. ఏ స్థానాన్ని పొందిన తరువాత తిరిగి ఈ భూమి మీదకు రావలసిన పని లేదో ఆ స్థానంలో ఉంటాడు. మీరు అనుకున్న చోట ఆయన లేడు. ఆయన పొందిన స్థితి మీకు అర్థంకాదు.

స్వస్వరూప అనుసంధానమే భక్తి అని ఆచార్యులవారు చెప్పారు. నీ లోపల ఉన్న సద్వస్తువు మీద నిరంతరము నీ మనస్సుని నిలబెట్టి ఉంచటమే నిజమైన భక్తి. మన మనస్సుకి ఇష్టమైనవి జరిగితే ఒక రకంగా ఉంటాము, మన మనస్సుకి ఇష్టంలేనివి జరిగితే ఒకరకంగా ఉంటాము అది భక్తుడి లక్షణం కాదు. భక్తుడు అంటే మీరు అడ్డబొట్టుపెట్టుకున్నారా, నిలువుబొట్టు పెట్టుకున్నారా అది కాదు. మీకు ఇష్టమైన సంఘటనలు జరిగినా, ఇష్టంలేని సంఘటనలు జరిగినా వాటిని ఈశ్వర ప్రసాదంగా తీసుకోవాలి. మనం గుడిలోకి వెళ్ళినప్పడు శనగలు ఏవో ప్రసాదాలు ఇస్తారు. అవి మనం ఎంత ఇష్టంగా తింటామో అలాగే మీ ప్రారబ్ధాన్ని కూడా ఇష్టంగా తీసుకోవాలి. అది భక్తుడి లక్షణం. నువ్వు నేను అనే తలంపును మరచిపోయి ఈశ్వరుడిని స్మరించుకుంటూ అన్నం తింటూ ఉంటే అది కూడా ఈశ్వరుని ప్రసాదం. మీ

జన్మ సంస్కారాన్ని బట్టి ఏ మార్గం ఇష్టం అయితే ఆ మార్గాన్ని అనుసరించి దేహగతమైన నేనులోంచి విడుదల పొందండి. మీకు దేహబుద్ధి ఉన్నంతకాలం ఆత్మబుద్ధి కలగదు. దేహం ఉండగా దేహబుద్ధిలోంచి ఎవరైతే విడుదల పొందారో వారు ఆత్మసుఖాన్ని పొందుతారు. ఒకోసారి గురువులకంటే శిష్యులు ఎక్కువ అదృష్టవంతులు ఉంటారు. శబరి గురువు మాతంగ మహర్షి. మాతంగ మహర్షికంటే శబరి ఎక్కువ అదృష్టవంతురాలు. శబరి దేవుడుకోసం అన్వేషించకుండా దేవుడే శబరి దగ్గరకు వచ్చాడు. అది ఆవిడ ప్రారబ్దవైభవం. శబరి మాతంగ మహర్షికి 30 సం॥లు సేవ చేసింది. అప్పుడు మాతంగమహర్షి శబరీ నాకంటే నువ్వే అదృష్టవంతురాలవు ఎందుచేతనంటే భగవంతుడే నీ దగ్గరకు వస్తున్నాడు నిన్ను చూడటానికి, ఆ వైభవం నాకు లేదు. ఆ వైభవం నీ ఒంటిమీద ఉంది. శబరి గురువు మాతంగమహర్షి అని లోకం చెప్పకొనే మాటలే కాని వైభవం అంతా నీదే అన్నారు గురువుగారు.

అసలు రైట్ మైండు లేకపోతే రైట్ యాటిట్యూడ్ లేకపోతే జ్ఞానంవైపుకు నీ మనస్సు అసలు తిరగదు. మనం ఎలా పనిచేస్తున్నాము అది చూసుకోవాలి. మనం చేసే పని వల్ల దేహభావన తగ్గుతోందా, మనం మాట్లాడే మాటల వల్ల దేహభావన తగ్గుతోందా, మనకి తలంపులు ఎలాంటివి వస్తున్నాయి అని మీరు ఒంటరిగా ఉండి వాచ్ చేసుకోవాలి. ఎదుటివాడు ఎంత చెడ్డవాడుగా మీకు కనిపించినా వాడిని ద్వేషించకండి. వాడిని ద్వేషించటం వలన మీ మనస్సు హృదయంలోనికి వెళ్ళదు. మీ మనస్సు వాడి మీదకే వెళ్ళిపోతుంది. ఎక్కడైతే రాగం ఉందో అక్కడికి మీ మనస్సు వెళ్ళిపోతుంది. ద్వేషంలోంచి బయట పడటం కంటే రాగంలోంచి బయటపడటం ఇంకా కష్టం. మీకు రాగద్వేషాలు లేవు అనుకోండి మీ మనస్సుని కదలమంటే కదలదు. బాహ్యముఖానికి వస్తున్న మనస్సుని అంతర్ముఖం చెయ్యటానికి మీకు సహకారం చేసేవాడే గురువు. అటువంటి సహకారం ఎవడైతే చెయ్యడో వాడు గురువు కాదు రాక్షసుడు. గురువు చెప్పేమాట మీ మనస్సును అంతర్ముఖ పరిచేలా ఉండాలి, వాడు గురువు.

భగవంతుడిని తెలుసుకోవాలంటే ప్రేమకావాలి. ఆ ప్రేమ భగవంతుడే ఇస్తాడు. భగవంతుడిని తెలుసుకోవాలనే బుద్ధి కూడా ఆయనే కలగజేస్తాడు. మన బిహేవియర్ ఎలా ఉంటే ఆయన తెలియబడతాడో ఆ బిహేవియర్ కూడా ఆయనే నేర్పుతాడు. మనకి తెలియబడటం అనేది కూడా ఆయనే చేస్తాడు. ఇంక మీరు నేను ఎక్కడ ఉన్నాము. అంటే

మనకి ఉన్న పొగరుబోతుతనం వల్ల మనం ఉన్నాము అనుకుంటున్నాము. జీవుడికి ఇది పెద్ద పని, ఇది చిన్నపని అని ఉంటుంది. దేవుడికి పెద్ద పని, చిన్నపని అని ఉండదు. అవసరం అనుకుంటే చిన్నపని అయినా సరే చేస్తాడు. జీవుడికీ, దేవుడికీ అదీ తేడా. మనం అన్నం వడ్డించటం మంచిపని అనుకుంటాము. ఆకులు తీసేయటం చెడ్డపని అనుకుంటాము. దేవుడు అలా అనుకోడు. మనం కూడా దేవుడు అవ్వాలి అనుకుంటే ఆ దేవుడిలాగ పని చేయటం నేర్చుకోవాలి. అది మాటలతో అవ్వదు. మాటలతోటి మోసపోయేటంత అమాయకుడు కాదు దేవుడు. మాటలతోటి ఒక మనిషిని మోసం చేయగలం కాని, దేవుడిని మోసం చేయలేము. శంకరాచార్యులవారు అన్నారు ఈ మాయదారి మొగుళ్ళు రకరకాలుగా ఉంటారు. కొంతమంది రోజూ తాగి వస్తారు, కొంతమంది డబ్బు తగలేస్తారు. కాని మీ హృదయంలో ఉన్న శాంతే మీ నిజమైన భర్త. మీ హృదయంలో ఉన్న శాంతి మీకు దొరికినప్పడు ఈ మాయదారి మొగుళ్ళు ఎలా ఉన్నా ఫరవాలేదు. బయట ఉన్నవాళ్ళు బాగుంటేమంచిదే ఒకవేళ వారు సడన్‌గా మీకు ఎదురు తిరిగినా నీ శాంతి నిన్ను కవచంలా కాపాడుతుంది. బాహ్యపరిస్థితులు సడన్‌గా మారినా అప్పడు మీ హృదయంలో ఉన్న శాంతి మిమ్మల్ని కాపాడుతుంది. బ్రాహ్మీస్థితి పొందటానికి నువ్వు ఎన్ని రకాలుగా కష్టపడతావో అన్నిరకాలుగా కష్టపడు. నువ్వు బ్రాహ్మీస్థితిని పొందాలి. అదే నీగమ్యం. ఆ బ్రాహ్మీస్థితిని పొందటానికి అనుకూలంగా నీ జీవితాన్ని మళ్ళించుకో. నీకు బ్రాహ్మీస్థితి కలిగినా యజ్ఞ, దాన, తపస్సులు విడిచిపెట్టవద్దు. బ్రాహ్మీస్థితి కలిగినవాడికి యజ్ఞదాన తపస్సులు అవసరంలేదు. అయినా శరీరం ప్రారబ్ధాన్ని బట్టి తిరుగుతోంది కదా అలాగే యజ్ఞదాన తపస్సులు లోకంకోసం విడిచిపెట్టవద్దు. మనకి వందమంది దేవతల దయ అక్కర్లేదు. ఒక్క బ్రాహ్మీస్థితి పొందినవాడి దయ మీరు సంపాదిస్తే మీరు పొందవలసింది పొందుతారు. నీరు ఏ విధంగా అయితే పల్లానికి వెళ్ళిపోతుందో అలాగ జ్ఞానిమాట హృదయగుహలోకి తీసుకుపోతుంది. అది మాట కాదు మాట రూపంలో ఉన్న జ్ఞానం, మాట రూపంలో ఉన్న ప్రేమ, మాట రూపంలో ఉన్న దయ ఇది తెలియనివారు దురదృష్టవంతులు.

బాహ్యపరిస్థితులు నాకు వ్యతిరేకంగా ఉన్నాయి, బాహ్యపరిస్థితులు నాకు అనుకూలంగా ఉన్నాయి అని చెప్పేది నీ మనస్సు. భగవంతుడు మాయ అంతా తీసుకొనివచ్చి నీ మనస్సులో పెట్టాడు. దానిని వదిలేయి. దేవుడు సృష్టిలోంచి బయటికి వస్తే నిన్ను ఇంక దేవుడు ఏమీ

చేయలేడు. మీకు మనస్సుతోటి, దేహంతోటి తాదాత్మ్యం ఉంటేనే దేవుడు మిమ్మల్ని బొమ్మలు ఆడినట్లు ఆడిస్తాడు. కట్రాడు తెంపేసుకున్న దూడ ఎలా వెళ్ళిపోతుందో అలాగ నువ్వు మనస్సులోంచి బయటకు వస్తే ఆయన మాయ నుండి విడుదల పొందుతావు. అప్పుడు దేవుడు ఇంక మీ గొడవలకి రాడు. అప్పుడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. నువ్వు కానిదానిని నువ్వు అనుకుంటున్నావు. అది వదిలేస్తే చాలు ఇంకేమీ లేదు. అదే సాధన యొక్క గమ్యం. మీ హృదయంలో చైతన్యం ఉంది. మీ సాధనాబలం వల్ల, సజ్జన సాంగత్యం వల్ల, సద్గ్రంధ పఠనం వల్ల, ఈశ్వరుడిని ఉపాసన చేయటంవల్ల లోపల ఉన్న చైతన్యం కొంచెము మేల్కొంటూ ఉంటే మనస్సు యొక్క వాండరింగ్ తగ్గిపోతుంది. వరదలో మీరు గడ్డిపరక వేస్తే చాలా వేగంగా కొట్టుకుపోతుంది. అలాగే ఈ చైతన్యం లోపల మేల్కొన్నప్పుడు మన మనస్సనే గడ్డిపకరని కొన్ని క్షణాల్లో లోపలికి లాగేస్తుంది. ఇంక ఈ పుణ్యము, పాపము లెక్కలు వేసేవాడు ఉండడు. మీరు శాంతి ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటే మీ శరీరానికి చావు వచ్చినా వచ్చిందని కూడా మీకు తెలియదు. మీకు లోకం కనిపించకపోయినా కనిపించటం లేదని తెలియదు. అక్కడ శాంతి ప్రవాహంలో ఈదులాడూతూ ఉంటారు.

ఒకవేళ దేవుడు ఎప్పుడైనా కనిపిస్తే నాకు మంచి బుద్ధిని ప్రసాదించమని అడగండి. వరాలు మీరు అడిగారా కష్టాలు తెచ్చిపెట్టుకున్నట్టే. మనకు వరం ఇచ్చి ఆ వరం వెనకాల బాధలన్నీ పంపేస్తాడు. భగవంతుడు మాయావి. అసలు మనకు ఏమి కావాలో మనకే తెలియదు కాబట్టి స్వామీ మేము అహంకారంతోటి బతుకుతున్నాము. మాకు ఏది మంచిదో తెలియదు. తెలియక కోరికలు కోరుకుంటాము. ఒకోసారి మేము మంచి అనుకున్నది భవిష్యత్తులో చెడ్డ తీసుకురావచ్చు. తండ్రీ మాకు మంచి ఏదో చూపించి మమ్మల్ని తరింపచేయి అని ప్రార్థించాలి. తల్లితండ్రులు చెప్పినట్లు వినవలెను అని చెపుతారు. ప్రహ్లాదుడు అలా వినలేదు. ఎందుకు అంటే దేవుడికోసం వినలేదు. భగవంతుడిని తెలుసుకొనే ప్రయత్నంలో ఒకవేళ ధర్మాన్ని వదిలేసినా అది మీకు చెడ్డచేయదు. భగవంతుడిని తెలుసుకునే ప్రయత్నంలో మీరు తల్లితండ్రులకి దూరమైనా అపచారం లేదు. అలా ప్రహ్లాదుడు చేసాడు. ఇంకా ఎన్ని గొడవలు ఉన్నాయో, ఇంకా కష్టాలు వచ్చేస్తున్నాయి ఏమిటి అని మీరు అనుకుంటున్నారు. రానివ్వండి అన్నారు భగవాన్. మీరు వద్దంటే ఆగుతాయా, ఆ గొడవలు అన్నీ వచ్చి మీద

పడిపోనియ్యండి. మీకు రక్షకుడు ఉన్నాడు కదా! ఎక్కడైతే వికారాలు లేవో, ఎక్కడైతే మీకు నిజమైన నేను ఉందో మీరు అక్కడికి వెళ్ళిపోతే ఈ బయటి గొడవలు మిమ్మల్ని ఏమి చేస్తాయి. అవి వస్తాయి పోతాయి. మంచిగొడవలు వచ్చినా అబద్ధమే, చెడ్డగొడవలు వచ్చినా అబద్ధమే. మంచి చెడ్డా మనస్సులో ఉంది. చైతన్యంలో ఏమీ లేదు. అది లేదా అంటే ఉంది. దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం ఆనందం. మనం అక్కడ మేల్కోవాలి. గురువు చేసే సహాయం ఏమిటి అంటే ఎక్కడైతే మనం ఉన్నామో అక్కడికి మేల్కొలపటానికి ప్రయత్నం చేస్తాడు. అప్పుడు మీ దేహ ప్రారబ్దంలో మీకు మంచి ఉంటే ఏదో మంచి అనుభవిస్తున్నాం అని మీకు అనిపించదు. చెడ్డ వస్తే కుంగిపోరు. ఎందుచేతనంటే అసలు మీరు వాటిమీద డిపెండు అయి ఉండరు.

దేవుడు వచ్చి మీకు కోటి జన్మలు వరకూ మోక్షంలేదు అంటాడు అనుకోండి అదేవిటయ్యా అలా అంటావేమిటి అని అనకూడదు. నీ ఉద్దేశ్యం కనుక అలాగే ఉంటే అలాగే కానియ్యి అనాలి. ఆయన సత్యసంకల్పుడు. దేవుడికి సంకల్పం వచ్చిందా అది నెరవేరితీరుతుంది. మన సంకల్పం నెరవేరదు. అప్పుడు మనం ఏమి చెప్పాలంటే నాకు ప్రత్యేకంగా సంకల్పాలు లేవు నేను కోటిజన్మలు పుట్టాలి అని మీ సంకల్పం అయితే అలాగే కానివ్వండి నాకు ఏమీ అభ్యంతరం లేదు, మీ సంకల్పమే నా సంకల్పం, మీ ఇష్టంమే నా ఇష్టం అని చెప్పేస్తే అప్పుడు భగవంతుడు అనుకుంటాడు వీడికి సొంత సంకల్పం లేదు, భారం మన మీద వేస్తున్నాడు అని అప్పుడు విడుదలచేసి వెళ్ళిపోతాడు. కోరిక లేకపోతే ఆ పని అవ్వదు అని మనం అనుకుంటాము. ఈశ్వర సంకల్పంలో ఉంటే నీ కోరికతో సంబంధంలేకుండా అయిపోతుంది. ఈశ్వర సంకల్పానికి శక్తి ఉంది కాని నీ కోరికకి శక్తిలేదు. భగవాన్ అన్నారు మీ దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి ఎక్కడైతే శాంతి ఉందో, ఎక్కడైతే సుఖం ఉందో ఆ స్థితిలోకి నువ్వు మేల్కోవటానికి నీ మనస్సునంతా, నీ శక్తినంతా ఉపయోగించుకో. వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన పనుల మీద నీ మనస్సుని పెట్టకు. మోక్షసుఖం పొందటానికి ప్రయత్నం చెయ్యి. మోక్షసుఖం పొందితే అన్ని సుఖాలు అందులోనే ఉన్నాయి. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. నిర్వాణసుఖాన్ని పొందటం తప్పించి మీ మనస్సు ఎక్కడకీ చెదిరిపోకూడదు. భ్రాంతులన్నీ ఊడిపోతే, వాసనలన్నీ ఊడిపోతే అప్పుడు బ్రహ్మము బట్టబయలు అవుతుంది. లోపల హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికీ జ్ఞానంరాదు. మీ హృదయం ఖాళీ అయిపోయింది

అనుకోండి శాంతిసామ్రాజ్యానికి మిమ్మల్ని అధిపతి చేయటానికి ఒక్క క్షణం కూడా ఆగడు. ఇప్పుడు ఈ మాటల ప్రయత్నం ఏమిటి అంటే లోపల ఉన్న ఆ జ్ఞానగంగ మీకు అందాలి. ఆ జ్ఞానగంగ మీకు అందటం లేదు. అది అందితే అప్పుడు ఆత్మసుఖం తెలుస్తుంది.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-11-2009, పాలకొల్లు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వనభోజనాలు అంటే వనంలో తులసిచెట్టు ఉండాలి, ఉసిరిచెట్టు ఉండాలి. ఉసిరి చెట్టు విష్ణువు యొక్క స్వరూపం, తులసి లక్ష్మీస్వరూపం. లక్ష్మీనారాయణులు ఉన్నచోట తినాలి అవి వనభోజనాలు అని శాస్త్రంలో చెప్పారు. మీరు కర్మమార్గంలో ప్రయాణం చేసినా, భక్తి మార్గంలో ప్రయాణం చేసినా ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానం నశించాలి. దానికి ఎంతో సాధన చెయ్యాలి. ఈశ్వరానుగ్రహం ఉండాలి, కాలం కలిసిరావాలి. లేకపోతే మనం సక్సెస్ అవ్వలేము. ఒక్క నారాయణుడు తప్పించి మనం అందరం జీవులమే, మనం స్వతంత్రులంకాదు. మనం స్వతంత్రులం అనే భావన మనకు ఉంది. అందుచేత కర్తృత్వం పెట్టుకొని బాధపడుతూ ఉంటాము. ఖురాన్‌లో చెప్పాడు మీ పెత్తనాలు ఇక్కడ చెల్లవు ఈ సృష్టి అంతా అల్లా ఇష్టప్రకారమే నడుస్తోంది. మీ ఆజ్ఞ అనుసరించి ఈ సృష్టి నడవటంలేదు. మీ దేహం ద్వారా ఏ అనుభవాలు అయితే పొందాలో ఆ అనుభవాలు పొందాక ఆ దేహం చనిపోతుంది. మాకు కష్టాలు, నష్టాలు రాకూడదు. లాభాలు, సుఖాలు రావాలి అని అందరూ కోరుకుంటారు. గుడికి వెళ్ళి భగవంతుడిని అది కావాలి, ఇది కావాలి అని అడుగుతారు కాని మోక్షం కావాలి అని ఎవరూ అడగరు. మనం భక్తులకింద చలామణీ అయిపోతున్నాము కాని మనందరం పెద్ద వ్యాపారస్తులం. మీ ఇంటి వద్ద చీపురుకట్ట లేదు అనుకోండి, ఆ టైములో మీకు నారాయణుడు కనిపిస్తే నాకు చీపురుకట్ట ఇమ్మని అడిగేస్తాము. జీవితంలో ఇలా అలవాటు పడిపోయాము. మనం అంత బుద్ధిలేని మనుషులం. భగవంతుడిని ఏది అడగాలో మనకు తెలియదు.

కష్టాలు, దుఃఖాలు ఎవరూ కోరుకోరు. కుంతి కష్టాలు కోరుకుంది, మీరాభాయి కోరుకుంది, అలా ఎవరో కొద్దిమంది ఉంటారు. ఒకోసారి భగవంతుడు కావాలనే మీకు దుఃఖాన్ని పంపిస్తాడు, అశాంతిని పంపిస్తాడు. అది జ్ఞానాన్ని ఇస్తుంది అని మీకు తెలియదు. మీకు తెలియక దుఃఖం వస్తూ ఉంటే వద్దు, వద్దు అనుకొంటారు. కష్టాలు, దుఃఖాలు ఎవరికైతే ఎక్కువగా వస్తున్నాయో వారికే తొందరగా ఆత్మజ్ఞానం కలుగుతుంది. అర్జునుడు పడ్డ దుఃఖం

వలననే పరమాత్మ ఆయనకు ఆత్మజ్ఞానం బోధించాడు. మీ మీద దేవుడికి విరోధం లేదు. మీ మనస్సులో ఉన్న వంకరలు తీసేయటానికే కష్టాలను పంపుతాడు. మనం శరీరానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాము కాని గుణానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వము. ఎందుచేతనంటే శరీరం నిజం అనుకొంటున్నాము, గుణం అబద్ధం అనుకొంటున్నాము. మీరు శరీరానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చినా అది ఏదోరోజు చనిపోతుంది. మీరు మంచి గుణాలను సంపాదిస్తే ఈ శరీరం స్మశానంలో కాలిపోయినా మీరు సంపాదించుకొన్న మంచిగుణాలు మరణానంతరం మీ కూడా వస్తాయి. హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి మంచిగుణాలు మీకు సహకరిస్తాయి. ధనంకంటే, పాండిత్యంకంటే గుణం గొప్పది. కొంతమంది ధనవంతులు ఉంటారు, పండితులు ఉంటారు, వారి గుణాలు సరిగ్గా లేకపోవటంవలన ఎప్పడూ అశాంతిలోనే ఉంటారు. అందుచేత మనం మంచి గుణాలను జాగ్రత్తగా పోషించుకోవాలి. సిగ్గువిడిచిపెడితే, అభిమానం విడిచిపెడితే అనేక భోగాలు అనుభవించవచ్చు అని రాజేంద్రప్రసాద్ చెప్పాడు. భర్తృహరి ఏమన్నాడు అంటే మగవాళ్ళు చేతులకు కడియాలు, ఆడవాళ్ళు చేతులకు గాజులు పెట్టుకొని తిరుగుతున్నారు. ఇలా బంగారం పెట్టుకొని తిరుగుతూ ఆ చేత్తోటి ఒక్క మంచి పని చెయ్యకపోతే ఆ చేతికి అందమా, చందమా అంటున్నాడు. మీ చేత్తోటి ఒక్క మంచిపని కూడా చేయకపోతే ఇంక ఆ చేతులు ఎందుకు? చెవులకు రకరకాల దుద్దులు పెట్టుకొంటున్నారు. మీ చెవులతో మంచి విషయాలు శ్రవణం చేయకపోతే ఇంక ఆ చెవులు ఎందుకు అంటున్నాడు భర్తృహరి.

పెద్దలను చూసి మీరు ఎప్పడూ పరిహాసం చేయవద్దు. ఎప్పడైనా అలా పరిహాసం చేస్తే అదంతా తిరిగి మీకే వస్తుంది. మన శరీరంలో ఉన్న వంకరలు స్మశానంలో కాలిపోతాయి కాని బుద్ధిలో ఉన్న వంకరలు పోవు. మన బుద్ధిలో చాపల్యం ఉంది. బుద్ధిలో చాపల్యం ఉన్నప్పడు శాస్త్రం చదివినా అది మనకు అర్థంకాదు. అందుచేత బుద్ధిలో ఉన్న చాపల్యం పోగొట్టుకోవాలి, బుద్ధిని పరిశుద్ధం చేసుకోవాలి. దీనికి రకరకాల మార్గాలు చెపుతున్నారు కాని నీ బుద్ధిలో ఉన్న వంకరలు పోవటానికి ఈ కలియుగంలో ఒక్క రామనామం చాలు అని నారదుడు చెప్పాడు. వాల్మీకి చెప్పే బోధ ఏమిటి అంటే మీ భావాలు మంచిగా ఉండేటట్లు చూసుకోండి. ఒక్క చెడ్డభావం వస్తే ఒకోసారి కుటుంబం అంతా కూడా నాశనం అయిపోతుంది. వ్యాపారస్థులు ఏరోజుకారోజు ఈ రోజు వ్యాపారం ఎలా ఉంది, ఎంత లాభం

వచ్చింది లేకపోతే ఎంత నష్టం వచ్చింది అని జాగ్రత్తగా చుసుకొంటారు. అలాగే మనం కూడా రోజూ పడుకునేముందు ఈ రోజు మన ప్రవర్తన ఎలా ఉంది అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. రక్షించేది రామాయణం అంటారు. కుటుంబంలో ఒకరికి చెడ్డ తలంపు వస్తే ఒకోసారి ఆ కుటుంబం అంతా నాశనం అయిపోతుంది. కైకకి వచ్చిన ద్వేషం అనే చిన్న తలంపు వలన దశరథుడు చనిపోయాడు, రాముడు అరణ్యానికి వెళ్ళిపోయాడు, కౌశల్య మంచం పట్టింది. అందుచేత మీరు తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. మీకు చెడ్డతలంపులు వస్తూ ఉంటే భగవద్గీత చదివినా ప్రయోజనం ఏమిటి? మంచితలంపులు వచ్చినవారికే ఆత్మజ్ఞానం వస్తోందో లేదో తెలియదు. ఇంక చెడ్డతలంపులు వస్తూ ఉంటే ఆత్మజ్ఞానం ఎలా వస్తుంది. నీకు రోజూ చెడ్డ తలంపులు వస్తూ ఉంటే నువ్వు ఒక్కడివే పాడవ్వవు నీ కుటుంబం అంతా కూడా పాడవుతుంది. వాల్మీకి ఏమని చెప్పాడు అంటే అది త్రాచుపాము, పైగా కోపముగా ఉంది, ఆ పాము కాటువేస్తే నీ శరీరానికి ఎటువంటి గతిపడుతుందో అలాగ మీరు ఏ విషయం గురించి అయినా బెంగ పెట్టుకుంటే మీ మనస్సుకి కూడా అదే గతి పడుతుంది అని చెప్పాడు.

గాఢనిద్రలో నాకు ఇది కావాలి, అది కావాలి అని ఎవరూ కోరుకోరు మెలకువ వచ్చాక నాకు అది కావాలి, ఇది కావాలి అని కోరుకుంటున్నావు. అది నీ తలంపు. నీ తలంపు ఎంత నిజమో నువ్వు కోరుకొనే వస్తువు కూడా అంతే నిజం అన్నారు భగవాన్. గాఢనిద్రలో ఉన్న వాడికి సంసారం ఏముంది. మెలకువగా ఉన్నవాడికే కదా సంసారం. మెలకువగా ఉన్నప్పుడు మనిషి తలంపులతోటి ఉంటున్నాడు. లోకంలో నువ్వు కోరే పదార్థాలన్నీ కూడా నీ తలంపు ఎంత నిజమో ఆ పదార్థాలన్నీ కూడా అంతే నిజం. నువ్వు కర్మమార్గంలో ప్రయాణం చేసిన, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా గమ్యం ఒక్కటే. జ్ఞానయోగం కంటే కర్మయోగం మంచిది అంటున్నారు. కర్మయోగం అంటే నీ పని నువ్వు శ్రద్ధగా చేసుకుంటూ నెమ్మదిగా ముగ్గుతూ రావాలి. నీచేతిలోపని విడిచిపెట్టేస్తే నీకు సోమరితనం వస్తుంది కాని జ్ఞానం రాదు. రామకృష్ణుడు ఏమని చెప్పాడు అంటే పని మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోవాలి కాని మనం పనిని విడిచిపెట్టకూడదు. నువ్వు బలవంతాన కర్మ విడిచిపెడితే ఆ కర్మే వచ్చే జన్మలో నిన్ను వెంటాడుతుంది, ఆ పనే మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. అందుచేత భగవంతుడు నీకు ఏ పనిని అయితే కేటాయించాడో ఆ పనిని నువ్వు హృదయపూర్వకంగా చేసుకుంటూ, చేసుకుంటూ బంధంలోంచి విడుదల అవ్వాలి. నువ్వు విడిచిపెట్టవలసినది పనిని కాదు.

నువ్వు విడిచిపెట్టవలసినది ద్వేషాన్ని. నువ్వు చేసేపని ద్వేషం లేకుండా చెయ్యి, ఆసక్తి లేకుండా చెయ్యి, స్వార్థం లేకుండా చెయ్యి. అప్పుడు నీ మనస్సు పవిత్రం అవుతూ ఉంటుంది. నీ ప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి అదృష్టం వస్తుంది అప్పడు పొంగిపోయి, ఒకోసారి దురదృష్టం వస్తుంది అప్పడు కుంగిపోతూ ఉంటే నువ్వు జ్ఞానానికి పనికిరావు. నువ్వు అర్హుడవుకాదు, మీకు యోగ్యత రాదు. నువ్వు అదృష్టం వచ్చినప్పడు అదృష్టంతోటి కలిసిపోయి, దురదృష్టం వచ్చినప్పడు దురదృష్టంతోటి కలిసిపోతే నీ బుద్ధిలో ఉన్న వంకరలు తగ్గవు, నీ బుద్ధి శుద్ధి అవ్వదు. మళ్ళీ కొత్త జన్మలు పెరిగిపోతాయి.

నీకు ఈశ్వరుడి పట్ల విశ్వాసము లేదు, అధ్యయనము లేదు, భూతయజ్ఞము లేదు (భూతయజ్ఞము అంటే నలుగురికి ఉపకారం చేయటం) బ్రహ్మయజ్ఞము లేదు (బ్రహ్మయజ్ఞము అంటే గీత అది బాగా అధ్యయనము చేయటం). మనకు ఏదీ లేదు. ఇంక సోమరితనానికి అలవాటు పడ్డాము. లోపల దురాశ పెట్టుకొని, లోపల కామం పెట్టుకొని కళ్ళు మూసుకుని కూర్చుంటే నీకు జ్ఞానం వచ్చేస్తుందా? నువ్వు డంభాచారిగా ఉండకు. జీవితంలో వాస్తవ పరిస్థితులను ఎదుర్కో, నువ్వు ఎక్కడికి పారిపోకు. నువ్వు గృహస్థాశ్రమంలో ఉన్నా, నువ్వు తెల్లబట్టలు వేసుకున్నా కాంక్ష లేకుండా, ద్వేషం లేకుండా పనిచేస్తే నువ్వు కూడా సన్యాసితోటి సమానమే. మీరు ఆసక్తి లేకుండా పనిచేస్తే మీకు ఫలితం అనుకూలంగా వచ్చినా అది మిమ్మల్ని బంధించదు. మనం కోరి తెచ్చుకున్నది బంధిస్తుంది.

ఈ ప్రపంచంలో ఏ దేశం వెళ్ళి చూచినా, ఎవరింటికి వెళ్ళి చూచినా రాగద్వేషాలు తప్పించి ఈ సృష్టిలో ఏముంది? బట్టలనిండా పెంట వాసన, మనస్సునిండా కామవాసన ఇదే ప్రపంచం అంటే అన్నాడు గౌతమబుద్ధుడు. నువ్వు రాగద్వేషాలు లేకుండా నీ డ్యూటీ నువ్వు చెయ్యి. నువ్వు ఎవరి మీదైనా అయిష్టంగా ఉన్నంతమాత్రం చేత వాళ్ళు పాడైపోరు. నువ్వు వారిమీద ఇష్టంగా ఉన్నంత మాత్రంచేత వారు బాగుపడిపోరు. వారి దేహప్రారబ్ధం ఎలా ఉంటే అలా జరుగుతూ ఉంటుంది. నిర్ధేశించటానికి మనం ఎవరము. మనం ఒకరిని పాడుచేయలేము, ఒకరిని బాగు చేయలేము. నువ్వు కర్తృత్వం ఎక్కడా పెట్టుకోవద్దు. ఈ పని నావల్ల అయ్యింది, ఆ పని నావల్ల అయ్యింది అని మీరు లోపల అనుకోకండి. నీకు ఆ బుద్ధి కలిగించినవాడు పరమేశ్వరుడు. నీ తెలివితేటలు కాదు. ఈశ్వరసంకల్పాన్ని బట్టి మీ శరీరాన్ని, మీ మనస్సుని, మీ బుద్ధిని ఉపయోగించుకుని మీ ద్వారా పనిచేసేవాడు

భగవంతుడు. అందుచేత మనం ఎక్కడా కర్తృత్వం పెట్టుకోకూడదు. అహంకారం పిసరంత ఉన్నా పునర్జన్మ వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు.

యోగం అంటే నిగ్రహం. పూజలు, జపాలు, ధ్యానాలు పూర్వం పెద్దలు ఎందుకు పెట్టారు అంటే మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం కోసం పెట్టారు. మీ మనస్సు మీకు స్వాధీనం అవ్వటం లేదు అనుకోండి సత్‌పురుషులతోటి సహవాసం చెయ్యండి. ఒక మహాత్ముడితోటి, ఒక మహర్షితోటి, ఒకయోగితోటి మీకు మానసిక అనుబంధం ఉంటే మనస్సు నెమ్మదిగా అణిగి పోతుంది. మనకి మనోనిగ్రహం ఉంటే, ఇంద్రియనిగ్రహం ఉంటే హైవేలో మన ప్రయాణం ఎలా ఉంటుందో ఆత్మజ్ఞాన సముపార్జన కోసం మనం చేసే ప్రయాణం అలా ఉంటుంది. మనకి మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం సాధ్యంకాదు, కాశీ వెళ్ళి వచ్చాము, గంగానదిలో స్నానం చేసాము అంటే ఇవిఅన్నీ మనం పవిత్రులం అవ్వటానికే. ఆ గంగ అంటే మన కాలువలో నీరు అనుకోకండి, అది తీర్థం. మనం పరమేశ్వరుడిని, నారాయణుడిని ప్రార్థిస్తున్నాము. మీరు వచ్చి ప్రార్థించండి అని వారు మనలను అడగటంలేదు. మనం బాగుపడటంకోసం, మన చైతన్యస్థాయిని పెంచుకోవటంకోసం మనం దేవతలను, మహాత్ములను ప్రార్థిస్తున్నాము. మనం ప్రార్థించకపోతే వారికి వచ్చే నష్టం ఏమీ లేదు. మనం సూర్యనమస్కారములు చేస్తున్నాము. మన బుద్ధిని బాగుచేయమని, వివేకమును, విచక్షణను ప్రసాదించమని సూర్యుడిని ప్రార్థించటం. మీకు సూర్యనమస్కారములు ఇష్టంలేకపోతే మానేయండి అంతేగాని ఎగతాళిగా నవ్వకూడదు. మనకు బుద్ధిసూక్ష్మత లేదు. పట్టుకొంటాము అని చెప్పి పడగొట్టేవారు ఎక్కువ మంది ఉంటారు. బుద్ధిసూక్ష్మత ఉన్నవారు మాత్రమే అది గ్రహించగలరు.

అందరిలోనూ నేను ఉన్నాను, నాలో అందరూ ఉన్నారు అని పరమాత్మ చెప్పాడు. సూక్ష్మబుద్ధి ఉన్నవాడు దేహాన్ని చూడడు, వాడికి రూపబుద్ధి, నామబుద్ధి ఉండదు, వాడు అంతర్యామిగా ఉన్న నారాయణుడినే చూస్తాడు. సముద్రంలో కెరటాలు ఉన్నాయి, కెరటాలలో ఎవరు ఉన్నారు, కెరటాలలో సముద్రమే ఉంది. అది కెరటం కింద కనిపిస్తోంది అంతే. ఈ నామరూపములు ఊరికే కెరటాల కింద కనిపిస్తున్నాయి కాని అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడే. రూపబుద్ధిని, నామబుద్ధిని పోగొట్టుకొని చూస్తే చైతన్యం ఇక్కడే అనుభవంలోనికి వస్తుంది. మన శరీరం చనిపోనక్కరలేదు, ఈ దేహం ఉండగానే దేహబుద్ధి నశించాలి వాడికి మోక్షం వస్తుంది. గౌతముడు అహల్యను శపించాడు కాని అహల్యది తప్ప

ఏమీలేదు. ఒకోసారి మనం తప్పు చేయకపోయినా గొడవలు వస్తూ ఉంటాయి, అది ప్రారబ్ధం. ఒకోసారి మనం నిజంగా మంచికోసం వెళితే చెడ్డ ఎదురవుతూ ఉంటుంది. గౌతముడు శపించాక మరల రాముడి పాదస్పర్శ వలన అహల్య స్త్రీ అయింది, ఆవిడ ఎప్పుడూ పవిత్రురాలే. మరణానుభవం ద్వారా పదవ తరగతి చదివే వెంకట్రామన్ మహర్షి అయ్యాడు, రాముడి పాదస్పర్శ వలన అహల్య మహాజ్ఞాని అయిపోయింది, అంటే ఆవిడ శాపం అంతా వరంకింద మారిపోయింది. అహల్యను శపించటం తప్పని పశ్చాత్తాపపడి తరువాత గౌతముడు అహల్యను దగ్గరకు తీసుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. గౌతముడికి మనస్సు పోలేదు, అహల్య మనస్సులేని స్థితికి ఎదిగివెళ్ళిపోయింది. అహల్య నా భార్య అని గౌతముడు అనుకొంటున్నాడు. ఆయన నా భర్త అనే ధ్యాస అహల్యకు పోయింది. అంటే మనస్సు ఉన్నవాళ్ళు మనస్సు లేనివాళ్ళని ముట్టుకోగలరా? అహల్య అగ్నిహోత్రం అయిపోయింది, ఇంక వీడు ఎలా ముట్టుకోగలడు. మనస్సు ఉన్నవాడు మనస్సులేని వాళ్ళని అర్థం చేసుకోగలరా? మనం వారిని చూసి ఆనందించాలి కాని వారిలా మనం అవ్వటం అంత తేలికకాదు. ముందు వారిని చూసి ఆనందించాలి. ఎక్కడైనా మంచి చేస్తున్నారు అనుకోండి అది చూసి ఆనందించాలి గాని ద్వేషం పెట్టుకోకూడదు. ఎవరినో చూసి ద్వేషం పెట్టుకొంటారు అనుకోండి దాని వలన మనకు ఏమి కలిసివస్తుంది. ఏమీ కలిసిరాదు సరికదా ఉన్నది పోతుంది, ద్వేషం పెట్టుకోవటం వలన శరీరం వేడెక్కుతుంది, మనస్సు వేడెక్కుతుంది.

నీ బుద్ధితో మనస్సును జాగ్రత్తగా నిగ్రహించుకొని దానిని శుద్ధి చెయ్యాలి. మనం ఏదో చెడ్డ పని చేయాలి అనుకొంటాము. నువ్వు చేసేది చెడ్డ పని అని నీ బుద్ధి చెపుతుంది. మనస్సు ఆలోచిస్తుంది కాని నిర్ణయం బుద్ధిదే. బుద్ధి నిర్మలం అవుతోంది అనుకోండి, బుద్ధి పవిత్రం అవుతోంది అనుకోండి కృష్ణుడు అర్జునుడికి ఎలా బోధించాడో అలాగ నీ బుద్ధే మనస్సుకు భోదించి మనస్సు యొక్క చాపల్యాన్ని ఆపుచేస్తుంది, అందుచేత మన బుద్ధే మనలను బాగుచేస్తుంది, అదే మనలను పాడుచేస్తుంది. అందుచేత బుద్ధిని బాగుచేసుకోవటంకంటే మించిన పని ఈ సృష్టిలో ఏమీ లేదు. దేహము కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే మనలో అంతర్యామిగా ఉన్న చైతన్యం గొప్పది. అక్కడకు నీ కళ్ళు తెరువు అని చెపుతున్నారు. అక్కడకు నీ కళ్ళు తెరవాలంటే బుద్ధి సహకారం లేకుండా అంతదూరం నీవు వెళ్ళలేవు. నీ బుద్ధి నీకు

సహకరించాలి. ఈ దేశంలో వందకోట్లమంది జనం ఉన్నారు అనుకోండి వందకోట్లమంది నీకు విరోధులు అయినా నీ బుద్ధి నీకు సహకరిస్తూ ఉంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది. మన బుద్ధి బాగా ఉంటే ఎవరూ మనలను పాడుచేయలేరు. మన బుద్ధి సరిగా లేకపోతే ఎవరూ మనలను బాగుచేయలేరు. నీ బుద్ధి బాగుపడటానికి, నీ బుద్ధిలో ఉన్న హెచ్చుతగ్గులు తగ్గటానికి, రాగద్వేషాలు తగ్గటానికి రామనామానికి మించిన మెడిసిన్ లేదని నారదమహర్షి చెప్పాడు. భరతుడు వచ్చే లోపుగా రాముడిని అరణ్యానికి పంపేయటానికి కైక తొందరపడుతుంది. అప్పడు రాముడు ఏమన్నాడు అంటే అమ్మా! నువ్వు కంగారుపడనక్కర లేదు. రాముడికి ఈ సృష్టిలో దేనిమీద అపేక్ష లేదు అని చెప్పాడు.

మనం సత్కర్మ చేయటం ఎవరినో ఉద్ధరించటానికి కాదు, నీ బుద్ధిని బాగుచేసుకోవటానికి నువ్వు సత్కర్మ చేయాలి. మీరు ఎవరికైనా ఏదైనా ఉపకారం చేసారు అనుకోండి, మీ ఉపకారాన్ని వారు గుర్తించకపోయినా అది మీకు అనవసరం ఎందుచేతనంటే వారి అహంకారం గుర్తించదు, మీ బుద్ధి బాగుపడటంకోసం ఆ పని చెయ్యాలి. ఒకవేళ మీరు గుర్తింపులు కోరుకుంటే మనకు రూపబుద్ధి, నామబుద్ధి పెరిగిపోతుంది. మనం మాట్లాడే మాటల వలన, చేసే పనుల వలన, మన ఆలోచనల వలన మనకు రూపబుద్ధి, నామబుద్ధి తగ్గాలి. ఈ రూపబుద్ధి, నామబుద్ధి ఎవడికైతే శేషం లేకుండా పోయిందో అప్పడు నది వెళ్ళి సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ ఆ జీవుడు వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవుతాడు, అది కడసారి జన్మ. అందరిలోనూ అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. ఎవడికైనా అపకారం చెయ్యాలనే బుద్ధి కలిగింది అనుకో వాడిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని నువ్వు గుర్తుపెట్టుకొంటే ఆ చెడ్డ పనులు అన్నీ ఆగిపోతాయి, ఎదుటివాడికి అపకారం చేయాలనే బుద్ధి పోతుంది. ఏది మంచి, ఏది చెడ్డ, ఎవరితో స్నేహం చేయాలి, ఎవరితో స్నేహం చేయకూడదు అని మనకు తెలియటంలేదు. ఎలా ప్రవర్తిస్తే మోక్షం వస్తుందో అది మనకు తెలియటంలేదు. ఇదంతా మన బుద్ధికి తెలియాలికదా. మన బుద్ధికి అటువంటి వివేకాన్ని ప్రసాదించు అని సూర్యనారాయణమూర్తిని ప్రార్థించటం. దేహభావన లేకుండా, వ్యక్తిభావన లేకుండా, అహంకారం లేకుండా నువ్వు ఒక పనిచేస్తే అది చేసినా చెయ్యనివాడితో సమానము ఎందుచేతనంటే ఆ పని తాలుక ఫలితంగాని, ఆ పనిలో ఏదైనా దోషం ఉన్నాగాని అవి ఏమీ నిన్ను అంటుకోవు. మీరు ఏదో మంచి పని చేయటం వలన సమాజం అంతా ఉద్ధరించబడి పోదు. సత్కర్మ ఎవరినో ఉద్ధరించటం కోసం కాదు. నీ ఆనందం కోసం, నీ శాంతి కోసం సత్కర్మ చెయ్యవయ్యా, అది భగవాన్ ఉవాచ.

# లేఖ

పూజ్యులు శ్రీ నాన్నగార్కి నమస్కారములు. గొరగనమూడిలోనూ, భీమవరంలోనూ చూచి మీ ప్రవచనాలను వినే అవకాశం నాకు మొదటిది. ఆ శ్రవణం తర్వాత అడిగిన వెంటనే మీరు ఆప్యాయంగా ఇచ్చిన మీ ప్రసంగ ప్రవచనాలను చదివి తద్వారా కొంత మననం చేసుకొన్నాను.

మీ గురించి ఇదివరలో నేను విన్నదంతా ఈ అనుభవం ద్వారా ధృవీకరించుకోవడం ఒకఎత్తు. మీ గురించి వారు చెప్పినది చాలా స్వల్పం. నేను విన్నదీ చూచినదీ అనల్పం, అనితర సాధ్యం అని అనాయాసంగా అవగాహన లభించడం మరో ఎత్తు.

మీరు చెప్పే పద్ధతిలో ఒక లయ ఉంది. శబ్దాలలో ఒక మర్మం ఉంది. ఖంఠంలో మాధుర్యం, గాంభీర్యం రెండూ అలవోకగా ఆకట్టుకుంటాయి. పైగా చెప్పదలచుకున్నది నిర్ద్వందంగా, స్ఫటికంలా, స్పష్టంగా, అనుభూతి ఆలంబనం అయిన అధికారికతో చెప్పడం మీలో సహజగుణం, స్వభావనైజం. విశ్లేషించిన విషయాలని అందరూ అర్థం చేసుకోవాలి జీవిత సరళిలో అన్వయం సాధించాలి. వీటి ద్వారా ఆ శ్రవణార్థానికి పరమార్థం చేకూర్చలన్న తపన, మీ ప్రవచనాల వెనక ఉన్న ఆ 'వేదన' వేదనా రమణీయం.

నేను చదివిన పుస్తకాలలో శ్రీరామకృష్ణుల కదామృతం. శ్రీ రమణుల సంభాషణలు నాకు చాలా ఇష్టం. శ్రీ రమణుల అంశమీలో ప్రస్ఫుటంగా, ప్రగాఢంగా ప్రతిబింబించడం "శిష్యుడి బాణీ గురువు వాణియే" అని అనిపింపచేస్తుంది. మీరు చెప్పిన వాటి వెనుక శ్రీ రమణుల పట్ల మీ ఆర్ద్రత, ప్రేమ, తాదాత్మ్యం పడుగూపేకల్లా కలిసాయి. మీ వాక్యాల వెనుక మౌలికంగా కనిపించే గుణం "జ్ఞానం" స్వస్వరూప దర్పణం. అందరికీ ఎంత చేరువో, ఆ జ్ఞానాన్ని కొంచెం మెలకువతో ప్రజ్వలనం అనాయాసంగా చేసుకోవచ్చో చెప్పాలన్న తపన, ఆ ఉద్దీపన కలిగించాలన్న ఉద్వేగం, ఇవి అందరూ అవగాహన చేసుకోవాలన్న వ్యాకులత. మీ ప్రవచనాల పిండితార్థాన్ని నా కోసం ఈ విధంగా అనుకున్నా

ఆ 'ఎరుక' కోసం
ఏ ఎరువు నీ
అరవు తెచ్చుకోక్కర్లే
అని ఎరువులూ
అమిరే ఉన్నాయి
అంతరంగంలో

ఒకచోట మీరు అన్నారు "తనను తాను దర్శించడమే మోక్షం", "తానుగా జీవించుటయే మోక్షం" దర్శన జీవిత సమన్వయమే అంతరంగ అవలోకనం. అందుకే ఎంతో హృద్యంగా మనస్సుని అనాయాసంగా ఆకట్టుకునే విధంగా ఆలోచనా ప్రేరకంగా అభివ్యక్తీకరణ మీ సహజ ప్రకృతి. మీ స్వభావ నైపుణ్యం.

గుండె గొంతుకలోన కొట్లాడుతుంది. అంతరంగ అనుబంధాల పరిధిలో కూడా ఇదే స్థితి.

**ఆచార్య శివరామకృష్ణ, హైదరాబాద్**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 13 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జనవరి | 1 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం (రమణ జయంతి) |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



# జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో భగవాన్ శ్రీ రమణ మహర్షి 130వ జయంతి మహోత్సవములు

## 01-01-2010 శుక్రవారం

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00ల నుండి | సద్గురు దర్శనం |
| ఉ॥ గం॥ 8-00ల నుండి | భగవాన్ పూజ శ్రీ రమణక్షేత్రంలో |
| ఉ॥ గం॥ 10-00ల నుండి మ॥ గం॥ 12-00ల వరకు | ప్రసాద వినియోగం |
| మ॥ గం॥ 12-00లకు | శ్రీ నాన్నగారు ఆశ్రమమునకు రాక |
| మ॥ గం॥ 2-00లకు | సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు |

# ద్వేషం ఉన్నచోట - దోషం ఉంటుంది

వ్యర్థంగా ఎవరైనా మనకు చెడు చేస్తారు అనుకోండి అప్పడు మనం నిర్వికారంగా, ఏకాంతంగా విచారించుకోవాలి. మన మనస్సు అప్పడు రజోగుణంలో ప్రవేశిస్తే మనకు ఈశ్వర ఆజ్ఞ ప్రకారం కొరడాదెబ్బ తినటానికి సిద్ధమైనట్లే. వారి మీద పగ దీర్చుకొంటే దాన్ని నాల్గురెట్లు పెంచుకొన్నట్లే. ఆ ప్రతిక్రియ చర్య వల్ల ప్రపంచాన్ని సత్యంగానూ బ్రహ్మాన్ని మిథ్యగాను చేసినట్లే. ఇది ఈశ్వర ధర్మాన్ని తలక్రిందులు చేసినట్లే. గర్వంతో విర్రవీగితే అప్పడాల పిండిలా తయ్యారౌతాము. శరీర మనోబుద్ధులతో తాదాత్మ్యం పొందితే అన్ని పాపాలకూ మూలమౌతుంది. మన శత్రువును ఎంత పరిణామంలో భాదించటానికి ఆలోచిస్తామో అంత పరిణామంలోనూ మనం బ్రహ్మ ధ్యానంలో లీనమైతే మన శత్రువు యొక్క శత్రుత్వం రూపు మాసిపోతుంది. ప్రేమ ఐక్యతను తెలుసుకోవటమే ముక్తి. శ్రీనాన్నగారు "వ్యక్తి పరంగా జీవించకుండా, సంఘపరంగా జీవించాలి. రాగ-ద్వేషాలతో జీవించినంతకాలం తలబద్ధలుకొట్టుకొన్నా జ్ఞానంరాదు అఖండంగా జీవిస్తే అఖండంగా ఉన్న ఆత్మ లభ్యమౌతుంది" అన్నారు. ఇతరులు మనలను కష్టపెడుతూ ఉంటే వారి మూలంగానే మన దోషాలు దిద్దుకోగలము. వారే మనకు గురువులు వారి వలననే మనం పవిత్రులమౌతాము. ఆత్మదర్శనం అయ్యే వరకూ జీవితం బరువుగానే ఉంటుంది ఎవరు ఏమి మాట్లాడినా వారి వాసనను బట్టి మాట్లాడుతున్నారు అని ప్రశాంతంగా ఉండాలి. తన దుఃఖానికి ఇతరులు కారణము అంటే ఆ ద్వేషంతో అసలు బాధకన్న కోపం వల్ల తెచ్చుకొన్న బాధే ఎక్కువ కాలం మనలను వేధిస్తుంది. క్షమాగుణంతో శత్రువుని క్షమిస్తే ప్రశాంతంగా ఉండగలము. కక్ష తీర్చుకోవటంలోనే ఆనందం ఉంది అనుకొంటే మనకు మనమే శిక్ష వేసుకొన్నట్లే. మనలను ఎవరైనా తిడితే అది వారి సమస్యే మనది కాదు వారి మనస్సే పాడౌతుంది. ఆ అసంతోషి, దుఃఖితుడు ప్రకృతి వాసనలతో కుళ్ళిపోయిన రోగి వాడిపై నేను కోపం తెచ్చుకోవటం ఏమిటి? అనే అవగాహన అనుభవ పూర్వకంగా రావాలి. తోటి మనిషికి అన్యాయం చెయ్యటం దైవానికి ద్రోహం చెయ్యటమే కారణం లేకుండా ఏదీ ఉండదని సహనం వహించాలి. తిరగబడితే కర్మబంధంలో పడి కొట్టిమిట్టాడవలసి వస్తుంది. గతిని నిరోధించుకొన్నవాళ్ళమౌతాము. మహిమదో ప్రవక్త శిష్యుడు అవి ఒకరిపై తిరగబడితే "తిరగబడటం వల్ల దేవతలు నిన్ను వదిలారు అందుచేత నేను నిన్ను వదిలాను" అని మహిమద్ అన్నారు. కాబట్టి ప్రతిక్రియ వల్ల గురు సహాయానికి దూరమౌతాము. కర్తయొక్క ఆజ్ఞను కాదనకూడదు. గమ్యాన్ని మర్చిపోకూడదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**